పేదలకు సొంతింటి నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరంలో పేదలకు ఇంటిస్థల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పేదలంతా సొంత ఇల్లు కలిగి ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం చేపట్టారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం భీమవరం మండలం యనమదుర్రు గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలం ఇవ్వడమే గాక ప్రతి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా రూ.1.80 లక్షలు నిధులు, బ్యాంకుల నుంచి మరో రూ.35 వేలు రుణం ఇప్పించినట్లు చెప్పారు. మొదటి విడతగా రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం జరుగుతుండగా భీమవరం నియోజకవర్గంలోనే సుమారుగా 15 వేల ఇళ్ల నిర్మాణం జరుగుతున్నట్లు ఎమ్మెల్యే శ్రీనివాస్ వివరించారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలకు ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వలేదని విమర్శించారు. వైఎస్సార్ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలను ఇస్తున్నట్లు చెప్పారు. అర్హులైన పేదలు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న 90 రోజులలో ఇంటి స్థలం మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వై.రవికుమార్, గ్రంధి పవన్, బూరాబత్తుల రామ్మూర్తి, చందు నాని తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న గృహ నిర్మాణాలపై ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం రాత్రి హౌసింగ్ అధికారులతో ఆయన క్యాంపు కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఎంతమంది గృహ నిర్మాణాలు చేసుకున్నారు? ప్రస్తుతం ఎన్ని గృహాలు నిర్మాణంలో ఉన్నాయి? ఇంకా గృహ నిర్మాణాలు ప్రారంభించని వారు ఎంతమంది ఉన్నారు? అనే దానిపై సమీక్ష చేశామన్నారు. లబ్ధిదారుల గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేలాది గృహ నిర్మాణాలతో జగనన్న కాలనీల పేరిట కొత్తగా ఊళ్లకు ఊళ్లు ఏర్పడుతున్నాయని అన్నారు. గృహ నిర్మాణాల చరిత్రలోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల గృహ నిర్మాణాలను చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నారని ఆయన అన్నారు. ఇందులో భాగంగా హౌసింగ్ అధికారులు ఎప్పటికప్పుడు నియోజకవర్గంలో గృహ నిర్మాణాల పురోగతిని నివేదిక రూపంలో అందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఈఈ వేణుగోపాల్, ఏఈలు శశి కుమార్, సాంబశివరావు పాల్గొన్నారు.

ఆకుమడులకు ఇబ్బంది లేకుండా చూడాలి

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆకుమడులు వేసుకున్న రైతులకు ముంపునీటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భీమవరం నియోజకవర్గంలో ఆకుమడులు ఎంతవరకు వేశారు? వరినాట్లు ఎంతవరకు పడ్డాయి? వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో నిర్ణీత సమయానికి రైతులు సాగు ఆరంభించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ వై.రవికుమార్, డీఈలు శ్రీనివాస్, పీఎస్ఎన్ మూర్తి, ఏఈ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రవీంద్రరాజు



కలెక్టర్ ప్రశాంతితో రవీంద్రరాజు

భీమవరం (ప్రకాశంచౌక్): గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా రెండో సారి ఎన్నికైన రుద్రరాజు రవీంద్రరాజు శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు అసోసియేషన్ నాయకులు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీ నెల 3వ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిదని, దానిని జిల్లాలో అమలు చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం వీఆర్వోల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటింటా సర్వే ప్రారంభం



కాళ్లకూరులో ఓటర్ సర్వే చేస్తున్న వీఆర్వో

కాళ్ల: ఓటర్ వెరిఫికేషన్ సర్వే మండలంలో ప్రారంభమైంది. దీనిలో భాగంగా శుక్రవారం గ్రామాల్లో బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటా సర్వే నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన ఓటర్ల వివరాలు, పేరు మార్పు, అడ్రస్ మార్పు వంటి వివరాలు సేకరిస్తున్నామని కాళ్ల తహసీల్దార్ కృష్ణారావు తెలిపారు. ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా పగడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వంకాయలపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాలకోడేరు: దోమల నివారణ ద్వారానే జ్వరాలను నియంత్రించ వచ్చని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రంగనాయుడు అన్నారు. ఫ్రైడే–డ్రైడే సందర్భంగా శుక్రవారం వంకాయల పాలెం ముదిరాజ్ ఏరియాలో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురుంచి ఆరోగ్య అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు శ్రీనివాస్, నాగమణెమ్మ, లలిత, వాణి, ఏఎన్ఎంలు హేమ, భవాని, హెల్త్ అసిస్టెంట్ గోపాలకృష్ణ, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఆర్ఏల ధర్నా

ఉండి: వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నిరసన దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నేరవేర్చాలంటూ నినాదాలు చేశారు. అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించి, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్ల సుబ్బారావు, గణేష్ ,నాగరాజు, డేవిడ్, థామస్, శ్రీను, బాలమణి, సింహాచలం, రవి తదితరులు పాల్గొన్నారు.

కలిగొట్లలో కేంద్ర బృందం పర్యటన



కలిగొట్లలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

ఉండి: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను కేంద్ర బృందం ప్రశంసించింది. ఉండి మండలం ఆరేడు, కలిగొట్ల గ్రామాల్లో పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ మోనిటరింగ్ అధికారి కేసీ మ్యాథ్యూస్ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించింది.ఈ సందర్భంగా గ్రామీణ ప్రజల ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై గ్రామాల్లో పరిశీలన చేశారు. కేంద్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య కార్యక్రమాలు గ్రామాల్లో అమలు జరుగుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీపీఎంఓ జీ సుగుణరాజు,జిల్లా స్టాటిస్టికల్ అధికారి శరభేశ్వరప్రసాద్, సర్పంచ్‌లు ఎంఎస్ సత్యనారాయణ, కట్రెడ్డి బ్రహ్మానందం, వైద్యాధికారులు ఎం రత్నరాజు, కే వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై కేసు

పెనుమంట్ర: మండలంలోని వెలగలేరు 28 నంబర్ చౌకడిపో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు పెనుమంట్ర సీఎస్ ఆర్ఐ వి.పోతురాజు శుక్రవారం తెలిపారు. డీలర్ అవకతవకలకు పాల్పడుతున్నాడని గ్రామస్తుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు డిపోను శుక్రవారం తనిఖీ చేశారు. స్టాకులో వ్యత్యాసాలు ఉన్నందున 6ఏ కేసు నమోదు చేశారు. కందిపప్పు 72 కిలోలు, పంచదార 5 కిలోలు, బియ్యం 70 కిలోలు స్టాకులో తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు.

చోరీ స్థలం పరిశీలన

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో గురువారం తాళం వేసి ఉన్న ఇంటిలో బంగారు నగలు చోరీ జరిగిన ఇంటిని జిల్లా ఎస్పీ రవిప్రకాష్ పర్యవేక్షించారు. శుక్రవారం పట్టణానికి వచ్చిన ఎస్పీ రవి ప్రకాష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ మనోహరాచారి, సీఐ దారావత్తు రాంబాబు ఉన్నారు.

మహిళ అదృశ్యం పై కేసు

ఇరగవరం: మండలంలోని రేలంగి ఇందిరానగర్ ప్రాంతానికి మహిళ కుమార్తెతో సహ అదృశ్యమైంది. ఎస్సై కె చంద్ర శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం తానేటి తక్షిక ఆర్పిప్స్ తన సంవత్సరం పాపతో సహ గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న భర్త తానేటి మహేంద్ర వర్మ ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పోషక విలువలు ఉన్న ఆహారం గర్భిణులు కచ్చితంగా తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వీరస్వామి అన్నారు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ అతి తక్కువ ఖరీదైన ఆకుకూరలు, గుడ్లు, పండ్లు తీసుకుని మంచి భావాలతో గర్భిణులు ఉండటం వలన ఆరోగ్యకరమైన పిల్లలకు జన్మిస్తారని అన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల సత్యనారయణ రాజు, కొప్పర్తి వీరరాఘవులు మాట్లాడుతూ ఆసుపత్రిలో జరుగుతున్న వైద్య సదుపాయాలు, సంపూర్ణంగా నిర్వహిస్తున్నారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దాతలు సహకారంతో గోంగూర, పాల కూర, కోడి గుడ్లు, బ్రెడ్స్, వేరుశెనగ ఉండలు 62 మంది గర్భిణులకు అందించామని తెలిపారు. వచ్చే శుక్రవారం ఇదే ప్రాంగణంలో సామూహిక సీమంతలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ రామ మహేశ్వరి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్‌టీ సెంటర్‌లో..

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో హెచ్ఐవీ బాధిత రోగులకు శుక్రవారం కొత్తల వసంతరావు చారిటబుల్ సేవ ట్రస్టు సహకారంతో న్యూట్రిషన్ సరుకులు సంపూర్ణంగా అందించారు. ఏఆర్‌టీ సెంటర్ వైద్యులు డాక్టర్ రాంబాబు బాధితులకు పౌష్టికాహారాన్ని అందిచారు. హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు కొప్పర్తి వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి రోడ్డును తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్లు



మట్టిరోడ్డుని తలపిస్తోన్న కోమటిగుంట ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు

కాళ్ల: మట్టి రహదారుల్లా కనిపిస్తున్న ఇది ఆర్ అండ్‌బీ రహదారే. ఇటీవల కాలంలో మండలంలో ఆక్వా చెరువుల తవ్వకాలతో పాటు చేలల్లో మెరక తొలగింపు పేరిట మట్టి రవాణా ట్రాక్టర్ల రాకపోకలు పెరిగాయి. అధికారులు పర్యవేక్షణ లేమితో ట్రాక్టర్ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో మట్టిని తరలించారు. యథేచ్ఛగా మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లు, లారీల జోరుతో రహదారులు ధ్వంసమయ్యాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కోమటిగుంట గ్రామంలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగించారు. ట్రాక్టర్లు, లారీలపై బరకాలు లేకుండా మట్టి తోలడంతో మట్టి రోడ్లపై పడి భారీగా పేరుకుపోయి ఆర్‌అండ్‌బీ రోడ్లు, సీసీ రోడ్లు మట్టి రోడ్లుగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్లు పాడవుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షానికి సీసలి నుంచి కోమటిగుంట వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బి రహదారి పుంత రోడ్డులా మారి ప్రయాణానికి వీలు లేకుండా తయారవ్వడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. కురిసిన కొద్దిపాటి వర్షానికి మట్టి పేరుకుపోయి రోడ్డంతా బురదమయమైంది . సంబంధిత మట్టి కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో ఇంజినీరింగ్ మెటీరియల్స్‌పై సదస్సు



సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల నానో టెక్నాలజీ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25, 26 తేదీల్లో ఇంజినీరింగ్ మెటీరియల్స్‌పై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ చెప్పారు. శుక్రవారం సదస్సుకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీరియల్ ఇంజినీరింగ్, మెటీరియల్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్ పేరిట ఎంఈసి ఏపీ–23 సదస్సు నిర్వహిస్తున్నామని మెటీరియల్స్ పరిశోధనలో ఎన్నో మంచి ఫలితాలు వస్తున్నాయని వాటిని మరింత ఎక్కువ స్థాయిలో ఉపయోగపడే విధంగా అంతర్జాతీయ నిపుణులతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు నిశాంత్‌వర్మ చెప్పారు. సదస్సు కన్వీనర్ ఆర్.వేణురెడ్డి, ఆర్అండ్‌డీ డీన్, డైరెక్టర్ పీఏ రామకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు రామరాజు, సాగి విఠల్‌రంగరాజు, డీన్ ఎవల్యూషన్ కేవీ మురళీకృష్ణమరాజు తదితరులు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ సెక్రెటరీలను క్రమబద్ధీరించి, వారిని సచివాలయ వ్యవస్థ ఉద్యోగులుగా గుర్తించి వారి అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో చెల్లబోయిన రంగారావు, యు.అంబేడ్కర్, పాలపర్తి భరత్, కె.సువర్ణరాజు, జి.దుర్గారావు, కె.సురేష్, కె.అన్నవరం పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

సాక్షి, భీమవరం: మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాల ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష శిబిరాన్ని ప్రారంభించిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధనాల వెంకటరావు, కర్రి నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు బి.వాసుదేవరావు, నీలాపు అప్పన్న, బంగారు వరలక్ష్మి, నిమ్మకాయలు ధనలక్ష్మి పాల్గొన్నారు.

భీమవరంలో పోలీసు పరేడ్



మార్కెట్‌యార్డు వద్ద పోలీసు పరేడ్ నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక మార్కెట్‌యార్డ్ వద్ద శుక్రవారం సివిల్, ఏఆర్, హోం గార్డ్ పోలీస్ సిబ్బంది జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఏఈవీ సుబ్బరాజు ఆధ్వర్యంలో పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఎప్పుడు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నపుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారన్నారు. ఆరోగ్యపరంగా ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే జిల్లా పోలీస్ ఆరోగ్య కేంద్రం సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం పోలీసు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలతో ప్రతి శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివస్‌ను నిర్వహిస్తున్నామని సిబ్బందికి శాఖపరమైన సమస్యలుంటే సంక్షేమ దివస్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం సబ్ డివిజన్ డీఎస్పీ బండారు శ్రీనాథ్, ఏఆర్ డీఎస్పీ ఎస్వీ సత్యనారాయణ, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



ఉండి పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను మరితం మెరుగుపరిచేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. ఉండి పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ పీ ధర్మతేజ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య పరిరక్షణ ప్రథమ కర్తవ్యంగా నిర్వహిస్తున్నారన్నారు. గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల ద్వారా గ్రామాల్లో ప్రజల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక అందుతుందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో వినూత్నంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక రోగులు, మంచంపై ఉన్న రోగులకు మంచి సేవలు అందుతున్నాయన్నారు. బీపీ, షుగర్ రోగుల ఆరోగ్య పరిరక్షణకు నెలకు సరిపడా మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ముఖ్యంగా ప్రతీ రోగి ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడంపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పీ ధర్మతేజ్, ఉండి గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య, కమతం బెనర్జీ, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

23న బ్రాహ్మణ ప్రముఖుల సమావేశం

ఉండి: ఈ నెల 23వ తేదీన విజయవాడలో బ్రాహ్మణ ప్రముఖుల సమావేశాన్ని వేదవిజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ బీవీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణ సామాజివర్గ అభివృద్ధి, రాజకీయ, సామాజిక అభివృద్ధి తదితర అంశాలపై సమావేశంలో చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకుంటామని ఆయన తెలిపారు.రాష్ట్ర నలుమూలల నుంచి ఇప్పటికే పలువురు సూచనలు, సలహాలు తీసుకున్నామని సమావేశం ద్వారా మరింత పురోగతి సాధిస్తామని ఆయన తెలిపారు.

అంతర పంటగా అల్లం



పెన్నాడపాలెం రైతులకు అల్లం విత్తును అందిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఉండి: జిల్లా రైతులు కొబ్బరి, మామిడి, సపోటా వంటి తోటల్లో అంతర పంటగా అల్లం పండిస్తే అద్భుతమైన ఆదాయాన్ని పొందవచ్చని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లిఖార్జునరావు అన్నారు. శుక్రవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో అంతర పంటగా అల్లం అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాలకోడేరు మండలం పెన్నాడపాలెం రైతులకు ప్రదర్శన నిమిత్తం అల్లం నారును అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ నల్ల మట్టి, ఎర్రనేలలు, ఇసుకతో కూడిన బంకమట్టి నేలలు అల్లం సాగుకు అనువైనవన్నారు. అంతర పంటగా సాగుచేస్తే మంచి ఆదాయం లభిస్తుందన్నారు. భారత సుగంధ ద్రవ్యాల పరిశోధనా సంస్థ కాలికట్ నుంచి ఇటీవలే విడుదలైన అల్లంలోని కొత్త రకాలైన మహిమ, వరద రకాలను ప్రస్తుతం ప్రదర్శన నిమిత్తం కేవీకేలో షేడ్ నెట్‌లో సాగు చేయడంతో పాటుగా పలువురు రైతులకు కూడా ప్రదర్శన నమిత్తం అందిస్తున్నట్లు తెలిపారు. మహిమ కొత్త రకంలో దుంప పెద్దవిగా, లావుగా ఉంటుందని అన్నారు. విత్తిన 200 రోజులకు దుంప తయారవుతుందన్నారు. ఈ రకం ఎకరాకు 9.2 టన్నుల అధిక దిగుబడినిస్తుందన్నారు. వరద రకం కూడా ఎకరాకు 9 టన్నుల దిగుబడి వస్తుందని తెలిపారు. దీనిలో దుంపలు లావుగా, బల్లపరువుగా ఉంటాయన్నారు. ట్రేలలో, గ్రో బ్యాగ్స్‌లో మిద్దెతోటల్లో కూడా అల్లం పెంచవచ్చన్నారు. దీని ద్వారా కనీసం ఒకటి నుండి 2 కేజీల దిగుబడిని సాధించవచ్చన్నారు. గ్రోబ్యాగ్స్ ద్వారా పండించే అల్లానికి నేలల ద్వారా వచ్చే కుళ్ళు తెగులు నుంచి కాపాడుకోవచ్చునన్నారు. అల్లం మొక్క ఆకులను సువాసనకు, టీ తదితర తయారీకి వినియోగించుకోవచ్చని సూచించారు.

మానవత సేవలు మరువలేనివి



ఆరేడులో ప్రమాణస్వీకారం చేస్తున్న మానవత మండల నూతన కార్యవర్గం

ఉండి :కులమతాలకు అతీతంగా మానవత స్వచ్ఛంధ సేవాసంస్థ సేవలు మారుమూల ప్రాంతాలకు అందిస్తున్నామని సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు.శుక్రవారం ఉండి మండలం ఆరేడులో మానవతా సేవాసంస్థ మండల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గం అధ్యక్షుడు కేటీఎస్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పెన్మత్స రామకృష్ణంరాజు,కోశాధికారి టీ మహేష్,ఉపాధ్యక్షుడు తాడి మునీశ్వరరావు,కార్యవర్గ సభ్యులుగా గంధం ఏడుకొండలు,వర్రే రామయ్య,కాగిత సోమేశ్వరరావు,బిళ్ళ విజయకుమార్‌ను సంస్థ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకీరామరాజు ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ దుఃఖంలో ఉన్నవారిని ఆదుకోవమే సంస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎస్ రామచంద్రారెడ్డి స్ఫూర్తితో సంస్థను జిల్లాలోని అన్ని మండలాల్లోను కార్యవర్గాలను ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నట్లు జానకీరామరాజు తెలిపారు.ఈ సందర్భంగా ఇటీవల కోలమూరులో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందజేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కాకర్ల వినాయక్,మానవతా మండలాధ్యక్షుడు దంగేటి రామలింగేశ్వరరావు, యువరాజు,ఎంఎస్ సత్యనారాయణ, కట్రెడ్డి బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ రాజ్యాంగాన్ని చదవాలి

ఆకివీడు: చట్టం, న్యాయ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని డీఎన్నార్ లా కళాశాల అడ్వకేట్ పీ.అమూల్యరావు పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి రాజ్యాంగాన్ని చదవాలన్నారు. దానిపై అవగాహన పెంచుకోవాలన్నారు. రక్షణ వ్యవస్థ, చట్టాలు, హక్కులు, బాధ్యతలపై ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సదస్సుకు ప్రిన్సిపాల్ కే. సుజాత అధ్యక్షత వహిస్తూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలు, చట్టం, న్యాయం, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు యు.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అపుస్మాపై ఆక్వా రైతు సంఘం హర్షం

పాలకొల్లు సెంట్రల్: ఆక్వా రైతుల కోసం ప్రభుత్వం అపుస్మా సంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమని జై భారత్ క్షీరారామ ఆక్వా సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆక్వా సంఘం నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాంధీభగవాన్‌రాజు మాట్లాడుతూ పాలకొల్లు, నరసాపురం, ఆచంట మూడు నియోజకవర్గాలకు సంబంధించి ఆక్వా రైతులతో నూతన సంఘం ఏర్పాటు చేశామన్నారు. ఆక్వా రైతులు సమస్యలను పరిష్కరించుకోవాలంటే అందరూ సంఘంలో చేరాలని సూచించారు. అందరూ సంఘటితంగా ఉంటే సమస్యలను పరిష్కరించుకోవడానికి బలం చేకూరుతుందన్నారు. ఆక్వా రైతు బాగుండాలంటే మూడు నెలలు పంట విరామం కావాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సెక్రటరీ బోణం నరసయ్య, కోడి విజయభాస్కర్, జాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్‌వీకేపీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సదస్సు

పెనుగొండ: స్థానిక ఎస్‌వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సదస్సు కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వివరించారు. 1974 నుంచి చదివిన పూర్వ విద్యార్థులందరూ సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల అనుబంధం మరింతగా బలోపేతం చేయడానికి సదస్సు దోహదపడుతుందన్నారు. 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కళాశాల సదస్సు నిర్వహించడం ఆనందదాయకమని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్ తదితరులు అన్నారు.